ఆక్రమణల చెరలో
తుమ్మలపెంట జంక్షన్

ఓ వైపు జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్.. మరో వైపు రామాయపట్నం పోర్టు. ఈ రెండింటి మధ్య పర్యాటక ప్రాంతంగా విరాజిల్లుతున్న బీచ్. అన్నింటికి ప్రధాన కూడలి తుమ్మలపెంట. ఒకప్పటి వరకు అదొక కూడలి మాత్రమే. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. పోర్టు, హార్బర్, బీచ్‌లు అభివృద్ధి చెందడంతో ఆ జంక్షన్ వ్యాపార కూడలిగా మారిపోయింది. ఇదే అదనుగా ఆక్రమణలు పెరిగిపోయాయి. రోడ్డు పక్కన స్థలాలను ఆక్రమించి దుకాణాలను ఏర్పాటు చేసుకోవడంతో రహదారి కుచించుకుపోయింది.



ఆక్రమణలతో కుచించుకుపోయిన తుమ్మలపెంట జంక్షన్

కావలి: వాణిజ్య, పర్యాటక రంగాలకు ప్రధాన రహదారి. ఆర్థిక, ఉపాధి, ఆహ్లాద రంగాలకు జీవనదారి. అసలే ఇరుకు రోడ్డు. దీనికి తోడు ఆక్రమణలు. అత్యంత కీలకమైన జంక్షన్‌లో అడ్డ దిడ్డంగా ఆక్రమణలు.. గందరగోళంగా దుకాణాల ఏర్పాటుతో వంద అడుగుల వెడల్పు ఉండాల్సిన రోడ్డు అడ్డగోలుగా కబ్జాలతో అసలు స్వరూపమే కోల్పోయింది. ఈ జంక్షన్ మీదుగా కనీసం 20 గ్రామాల ప్రజలు నిత్యం ప్రయాణిస్తుంటారు. అయితే ఇంత కాలం ఎలాగో జరిగిపోయింది. అయితే ఆ జంక్షన్ మీదుగా వాహనాల తాకిడి అధికంగా ఉండబోతోంది. తుమ్మలపెంట జంక్షన్ నుంచి ఉత్తరం రామాయపట్నం, దక్షిణం వైపు జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్, తూర్పు తుమ్మలపెంట బీచ్, పడమర కావలి పట్టణం. ఇలా నాలుగు రోడ్ల కూడలిలో ప్రభుత్వానికి చెందిన స్థలాలను ప్రైవేట్ వ్యక్తులు ఆక్రమించుకుని పలు రకాల నిర్మాణాలు చేసుకున్నారు. కొందరు అద్దెలకు ఇచ్చుకుని నెలవారీ వసూలు చేసుకొంటున్నారు. మరి కొందరు సొంతంగా వ్యాపారాలు చేసుకొంటున్నారు. ఈ ఆక్రమణలతో 100 అడుగులు ఉండాల్సిన నాలుగు రోడ్ల కూడలి.. కేవలం పది అడుగులకే పరిమితమైపోయింది. ఈ కాస్త రోడ్డులో దుకాణాల ముందు వాహనాలు పార్కింగ్ చేస్తుండడంతో పరిస్థితి మరింత సంక్లిష్టంగా, ప్రమాదభరితంగా మారింది.

పట్టించుకోని అధికార యంత్రాంగం

రాబోయే రోజుల్లో తుమ్మలపెంట జంక్షన్ అత్యంత ప్రధాన కూడలిగా మారుతుందని తెలియడంతో స్థానికులు వ్యాపారాల కోసం శాశ్వత నిర్మాణాలు చేపట్టాతున్నారు. అయితే ముందు ముందు ట్రాఫిక్ సమస్యలు తలెత్తే ప్రమాదంతో రహదారి విస్తరణ చేయాల్సిన పరిస్థితి వస్తుంది. ఆ సమయంలో శాశ్వత కట్టడాలు కూల్చేయక తప్పదు. ఈ కారణంగా దుకాణదారులు తీవ్రంగా నష్టపోయే అవకాశాలు ఉన్నాయి. అయితే సంబంధిత పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ అధికారులు భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని రహదారి ఆక్రమణలకు గురికాకుండా చూడడంతో పాటు దుకాణదారులను హెచ్చరించకపోవడంతో ఆక్రమణలు మరింతగా పెరిగాయనే స్థానికులు ఆరోపిస్తున్నారు. ఫిషింగ్ హార్బర్ ఒక మత్స్యకారులకే కాకుండా, ఇతర రంగాలకు చెందిన నిపుణులకు, ఇతర వర్గాలకు చెందిన వారికి కూడా ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉంటుంది. ఫిషింగ్ హార్బర్‌కు అనుబంధంగా బీచ్ టూరిజంను అభివృద్ధి చేసి పర్యాటకులకు ఆహ్లాదాన్ని అందించాలని ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈ క్రమంలో అటు జువ్వలదిన్నె హార్బర్‌కు చిన్న స్థాయి వాహనం నుంచి పెద్ద స్థాయి కంటైనర్ల వాహనాలు వరకు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. బీచ్ టూరిజం రంగం అభివృద్ధి వల్ల పర్యాటకులు కోకొల్లుగా రాకపోకలు చేస్తుంటారు. అంటే రానున్న రోజుల్లో ఈ జంక్షన్ మీదుగా వాహనాలు రద్దీ విపరీతంగా పెరగనుంది. రామాయపట్నం పోర్టు నిర్మాణం ప్రారంభమైతే దాని ఒత్తిడి కూడా ఈ జంక్షన్‌పై పడుతోంది. ఈ నేపథ్యంలో పంచాయతీ, ఆర్ అండ్ బీ, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో ఈ జంక్షన్‌లో ఆక్రమణలు తొలగించాల్సిన అవసరం ఉంది.



ఫిషింగ్ హార్బర్‌కు వెళ్లే రోడ్డు ఆక్రమణలతో సన్నటి బాటగా మారిన దృశ్యం



కావలి పట్టణానికి వెళ్లే మార్గంలో నడిరోడ్డులో ఉన్న ఆక్రమణ నిర్మాణాలు

క్లుప్తంగా

నేటి నుంచి పాండురంగ విఠలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



పాండురంగ విఠలేశ్వర స్వామి

సీతారామపురం: మండలంలోని నారాయణప్పపేట సమీపాన కొలువైన పాండురంగ విఠలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి 23వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు దేవస్థాన కమిటీ బృంద సభ్యులు శనివారం తెలిపారు. ఆదివారం ఉదయం కలశ స్థాపన, నవగ్రహ మంటపారాధన, అభిషేకాలు, సాయంత్రం అంకురారోహణ, ధ్వజారోహణ, 20వ తేదీ హనుమంత సేవ, 21వ తేదీ గరుడ సేవ, 22వ తేదీ రాత్రి కళ్యాణం, 22వ తేదీ రథోత్సవం, పారువేట నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఐదు రోజుల పాటు అన్నదాన కార్యక్రమంతో పాటు, పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశామన్నారు. కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి బ్రహ్మోత్సవాలను జయప్రదం చేయాలని కోరారు.

బిలకూట క్షేత్రంలో వాటర్ ప్లాంట్ ప్రారంభం

బిట్రగుంట: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండబిట్రగుంట బిలకూట క్షేత్రంలో భక్తుల సౌకర్యార్థం దాత గుర్రం ప్రభాకర్ సుమారు రూ.3 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను శనివారం ప్రారంభించారు. స్వామి దర్శనానికి వచ్చే భక్తులు తాగునీటి కోసం ఇబ్బంది పడకుండా మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు దాత తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రాధాకృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



తలంబ్రాలు సమర్పిస్తున్న దంపతులు

వరికుంటపాడు: మండలంలోని సాతువారిపల్లెలో కొలువైన కోదండరామస్వామి ఆలయంలో శనివారం సీతారాముల ఉత్సవమూర్తుల కల్యాణ మహోత్సవం కమనీయం, రమణీయంగా, భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు లోకా వెంకటప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో రుత్వికులు ఉత్సవ మూర్తులకు పంచా మృతాభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణ అనంతరం విగ్రహాలను గర్భాలయం నుంచి కల్యాణవేదికకు తరలించారు. లోక కల్యాణార్థం స్వామి వార్లకు వేదమంత్రోచ్ఛారణల మధ్య శాంతి కల్యాణం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు అన్న సంతర్పణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు పుచ్చలపల్లి వర్ధంతి

ఉదయగిరి: సీపీఎం ఉద్యమ నేత పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి కార్యక్రమం ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో జరుగుతుందని ఆ పార్టీ మండల కార్యదర్శి షేక్ ఫరిద్దీన్ బాషా, కమిటీ సభ్యులు పి.వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వర్ధంతి కార్యక్రమంలో ప్రజాసంఘాలు, సీపీఎం అనుబంధ సంఘాలు, నాయకులు, కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు: కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని ఆదివారం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. ఆదివారం సాయంత్రం 5 గంటలకు పార్టీ కార్యాలయంలో వర్ధంతి మహాసభ నిర్వహించనున్నట్లు, అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డేవిడ్‌రాజు, లక్ష్మీపతి, ఎ నాగయ్య, నాగేంద్ర పాల్గొన్నారు.

రోగులకు వైద్య సేవలు



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ పవన్

చేజర్ల: మండలంలోని పుట్టుపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో 104 వాహనం ద్వారా రోగులకు శనివారం వైద్య సేవలు అందించారు. డాక్టర్ పవన్ మాట్లాడుతూ ఎక్కువగా నడుము నొప్పుల రోగులను పరీక్షించామన్నారు. విటమిన్లు, ఖనిజ లవణాలు అధికంగా ఉండే ఆహార పదార్థాలను తీసుకోవాలన్నారు. రోగులకు బీపీ, షుగర్ పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించామన్నారు. సుమారు 70 మంది రోగులను పరీక్షించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ చంద్రయ్య, ఎంఎల్‌హెచ్‌పీ శ్రీదివ్య, ఏఎన్‌ఎం రత్నకుమారి, ఆశ వర్కర్ రమణమ్మ పాల్గొన్నారు.

గ్రీన్ ఫీల్డ్ హైవే రోడ్డు పనుల అడ్డగింత

- పరిహారం చెల్లించే వరకు పనులు ఆపాలని భైఠాయింపు



గ్రీన్ ఫీల్డ్ హైవే రోడ్డు నిర్మాణ పనులను అడ్డుకుంటున్న రైతులు

సీతారామపురం : మండలంలోని పబ్బులేటిపల్లి గ్రామానికి చెందిన పలువురు రైతులు శనివారం గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే రోడ్డు నిర్మాణ పనులను అడ్డుకున్నారు. భూములకు నష్టపరిహారం చెల్లించకుండా తమ భూముల్లోకి ప్రవేశించవద్దని, అంత వరకు హైవే రోడ్డు నిర్మాణ పనులు ఆపాలని డిమాండ్ చేస్తూ యంత్రాలకు అడ్డంగా రోడ్డుపై భైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పబ్బులేటిపల్లి పంచాయతీలో సుమారు 15 మంది రైతులకు చెందిన ఏడు ఎకరాల భూమి నేషనల్ హైవేలో పోతుందన్నారు. ఆ భూముల్లో బోర్లు, రాతి కట్టడాలు, తెట్టు గోడలు, టేకు చెట్లు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వంటివి ఉన్నాయన్నారు. భూములకు సంబంధించి ఆయా రైతులకు నష్టపరిహారం చెల్లించకుండానే కాంట్రాక్టర్లు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడం తగదన్నారు. మా భూములు అసైన్మెంట్ భూములని, రికార్డులు సక్రమంగా లేవని చెప్పడం శోచనీయమన్నారు. ఊరు పుట్టినప్పటి నుంచి ఆ భూములు తమ అధీనంలోనే ఉన్నాయన్నారు. నాటి నుంచి నేటి వరకు సాగు చేసుకుంటున్నామని వాపోయారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌ను కూడా కలిసి విన్నవించామని, అందుకు స్పందించిన ఆయన ఆర్బిటేషన్‌కు వెళ్లేందుకు అవకాశం కల్పించి క్షేత్ర స్థాయిలో విచారించి రైతులకు పరిహారం అందించేలా చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ లోపు ఎన్నికల కోడ్ అమల్లోకి రావడం, కాంట్రాక్టర్ హైవే నిర్మాణ పనులు చేపట్టడంతో తాము ఆందోళన బాట చేపట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. భూ పరిహారం సెంట్‌కు రూ.3500 ఇవ్వడం, బావులకు రూ.26 వేల ఇవ్వడం చాలా దారుణమన్నారు. పక్క పంచాయతీలో బావులకు లక్షలాది రూపాయలు ఇస్తూ, పబ్బులేటిపల్లి పంచాయతీలో మాత్రం తగ్గించడం ఎంత వరకు సమంజమన్నారు. తమకు భూ పరిహారం సక్రమంగా ఇప్పించాలని, అలా కాకుండా గ్రీన్ ఫీల్డ్ హైవే రోడ్డు నిర్మాణ పనులు మొదలు పెడితే తమకు ఆత్మహత్యలే శరణ్యమని రైతులు వాపోయారు.

శాంతి వాతావరణం నెలకొల్పేలా చర్యలు

- సీఐ వి.గిరిబాబు



జడదేవిలో గ్రామస్తులకు అవగాహనకల్పిస్తున్న సీఐ గిరిబాబు

వరికుంటపాడు: సార్వత్రిక ఎన్నికల అనంతరం మండలంలోని గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా శాంతి వాతావరణం నెలకొల్పేలా ఎస్పీ ఆదేశాల మేరకు తగిన చర్యలు తీసుకుంటున్నామని ఉదయగిరి సీఐ వేల్పుల గిరిబాబు తెలిపారు. ఆయన శనివారం మండలంలోని జడదేవి గ్రామంలో తన సిబ్బందితో కలిసి గ్రామస్తులతో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ అనంతరం గ్రామాల్లో ప్రజలు ఎలాంటి అల్లర్లు, ఘర్షణలకు పాల్పడకుండా ప్రతి ఒక్కరూ స్నేహపూర్వకంగా, శాంతి యుతంగా ఉండాలన్నారు. ఎన్నికల తుది ఫలితాలు వచ్చే వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళికి అనుగుణంగా నడుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై కె.తిరుపతయ్య, కానిస్టేబుల్స్ ప్రసాద్, నారాయణ, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మంగారి ఆరాధన



ఆత్మకూరులో బ్రహ్మంగారి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: కాలజ్ఞాన రచయిత, గొప్ప తత్వవేత్త పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాన్ని ఆత్మకూరులోని బ్రహ్మంగారి మఠంలో రెండు రోజుల పాటు వైభవంగా నిర్వహించారు. బైపాస్‌రోడ్డులోని బ్రహ్మంగారి ఆలయంలో తొలుత స్వామి వారి మూలవిరాట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆరాధన మహోత్సవాన్ని పురస్కరించుకుని హోమం నిర్వహించారు. స్వామి దర్శనం కోసం భక్తులు భారీగా తరలివచ్చారు. అన్నదానం నిర్వహించారు. శుక్రవారం రాత్రి స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను నంది వాహనంపై గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. తమ ఇళ్ల ముందుకు వచ్చిన స్వామి వారి ఊరేగింపు భక్తులు కొబ్బరికాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ప్రాణం నిలపండి

- బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్న బాలిక
- తల్లడిల్లుతున్న తల్లిదండ్రులు
- దాతల సాయం కోసం ఎదురుచూపు



దాతల సహకారం కోసం ఎదురుచూస్తున్న శ్రీవిద్య

సోమశిల: ఆట, పాటలు, చదువుతో చలాకీగా ఉండే ఆ బాలిక ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. ఆ పేదింటి బిడ్డ ఖరీదైన వ్యాధితో బాధపడుతోంది. వైద్యానికి రూ.లక్షల్లో ఖర్చవుతుందని వైద్యులు చెప్పడంతో అంత స్థోమతలేని ఆ తల్లిదండ్రులు బిడ్డ ప్రాణాలు కాపాడుకునేందుకు తల్లడిల్లిపోతున్నారు. అనంతసాగరం మండలం సోమశిల గ్రామానికి చెందిన రాచూరి వెంకటయ్య, కృష్ణమ్మ కుమార్తె రాచూరి శ్రీవిద్య సోమశిల ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. ఇటీవల అనారోగ్యానికి గురైంది. నెల్లూరులోని వైద్యులకు చూపించడంతో బ్రెయిన్ ట్యూమర్ వ్యాధిగా నిర్ధారించారు. దీంతో చదువు మధ్యలోనే ఆపేసింది. వ్యాధిని నయం చేయడానికి రూ.లక్షల్లో ఖర్చవుతుందని చెప్పడంతో గత్యంతరం లేక తల్లిదండ్రులు చెన్నైలోని ఆస్పత్రిలో చేర్పించారు. తమది పేద కుటుంబమని, దాతలు సహకరిస్తే తమ బిడ్డ తమకు దక్కుతుందని ప్రాధేయపడుతున్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



ప్రత్యేకాలంకరణలో స్వామివారు

సీతారామపురం: మండలంలోని గుండుపల్లిలో జరుగుతున్న సీతా సమేత ప్రసన్న కోదండరామస్వామి ఉత్సవాల్లో భాగంగా శనివారం సీతారాముల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారి కల్యాణాన్ని తిలకించారు. అనంతరం స్వామివార్లను ప్రత్యేక వాహనంలో ప్రతిష్ఠించి గ్రామోత్సవం నిర్వహించారు. అన్నదానం ఏర్పాటు చేశారు.

కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందజేత

సంగం: వేసవి తాపం అధికంగా ఉన్న క్రమంలో మండలంలోని అన్నారెడ్డిపాళెం గ్రామ పంచాయతీలో పని చేస్తున్న ఉపాధి హామీ కూలీలకు శనివారం ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఎండలు అధికంగా ఉండడంతో ఉపాధి హామీ పనులకు వచ్చే కూలీల సంరక్షణ బాధ్యతలను తీసుకుంటున్నామన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం



పైప్‌లైన్‌కు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

సోమశిల: మండలంలోని సోమశిల గ్రామ హిల్ కాలనీవాసులు నీటి సమస్య ఉందని ఆర్‌డబ్ల్యూఎస్, గ్రామ రెవెన్యూ అధికారులకు తెలపడంతో అధికారులు వెంటనే స్పందించారు. బోరు ఏర్పాటుకు ప్రత్యామ్నాయంగా కాలనీలోని జలసిరి పైపులకు మరమ్మతులు చేసి శనివారం నుంచి నీటి సమస్య లేకుండా ప్రతి ఇంటికి నీరు అందేలా ఏర్పాటు చేశామని అధికారులు తెలిపారు. గత కొంత కాలంగా స్థానిక ప్రజలు నీటికి కటకటలాడుతున్నారు.

ఖగోళ శాస్త్రం.. అవకాశాలు ఘనం



బుచ్చిరెడ్డిపాళెం గ్రంథాలయంలో అంతర్జాతీయ ఖగోళ శాస్త్ర దినోత్సవం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : రానున్న కాలంలో ఖగోళ శాస్త్రంలో అవకాశాలు ఘనంగా ఉంటాయని బుచ్చిరెడ్డిపాళెం శాఖా గ్రంథాలయ అధికారిణి కె.మంజులత అన్నారు. బుచ్చిరెడ్డిపాళెం శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో అంతర్జాతీయ ఖగోళ శాస్త్ర దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంతరిక్ష రంగంలో విశిష్ట సేవలు అందించిన కలాం, సునీతా విలియమ్స్, రాకేష్ శర్మలు విద్యార్థులకు ఆదర్శం అని తెలిపారు. నేటితో భారతావని అణుపరీక్షలు నిర్వహించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పోఖ్రాన్-1, పోఖ్రాన్-2 గురించి విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం 'ఖగోళ శాస్త్రంలో భారతీయుల పాత్ర' అనే అంశంపై విద్యార్థులకు పలురకాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రిసోర్స్ గ్రూపు సభ్యులు గండికోట సుధీర్ కుమార్, గ్రంథాలయ పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘాట్‌రోడ్డుకు మరమ్మతులు చేపట్టండి



కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న కొండ కింది గ్రామాల వాసులు

ఉదయగిరి: మండలంలో ఇటీవల కురిసిన వర్షానికి కోతకు గురైన ఉదయగిరి–బండగానిపల్లె ఘాట్ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతూ శనివారం సీపీఎం ఆధ్వర్యంలో కొండకింది గ్రామాల ప్రజలు ఆర్‌అండ్‌బీ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. సీపీఎం నేత కాకు వెంకటయ్య మాట్లాడుతూ ఉదయగిరి నుంచి బండగానిపల్లె వెళ్లే ఘాట్‌రోడ్డు సుమారు 5 కిలో మీటర్ల మేర నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉన్నాయన్నారు. రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఎన్నో సార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు కోతకు గురైందన్నారు. దీంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించే ఆటోలు, ద్విచక్ర వాహనదారులు, పాదచారులు పలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తే సుమారు 15 గ్రామాల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఉదయగిరిని కొండ కింది గ్రామాలకు ఈ మార్గం ద్వారా తక్కువ సమయంలో తక్కువ కిలో మీటర్ల దూరంతో చేరుకోవచ్చన్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేపట్టి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు. అనంతరం కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందించారు.

ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులను చేర్పించండి



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈఓ, హెచ్‌ఎం తదితరులు

సోమశిల: అనంతసాగరంలోని ఉన్నత పాఠశాలలో ఈ విద్యాసంవత్సం నుంచి ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీ గ్రూపులను ప్రారంభించారని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలంటూ ఎంఈఓ కాటంరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, హెచ్‌ఎం బట్రెడ్డి లక్ష్మీప్రసన్న, వైఎస్ఆర్‌పీఏ అధ్యక్షుడు మెట్టుకూరు సుబ్బారెడ్డి శనివారం ప్రచారం నిర్వహించారు. మండలంలోని లింగంగుంట, పాతదేవరాయపల్లి గ్రామాల్లో 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి తమ పిల్లలను అనంతసాగరం హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఇంటర్మీయట్ కళాశాలలో చేర్పించాలని కోరారు. మండలంలో ఈ విద్యాసంవత్సరంలో 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు కళాశాలలో చేరే విధంగా ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని కోరారు. వారి వెంట ఉపాధ్యాయ బృందం ఉన్నారు.

రక్తదాన శిబిరం నేడు

నెల్లూరు(బృందావనం) : పద్మావతినగర్‌లోని సాయిదర్బార్ అద్దాల మందిరం ఆధ్వర్యంలో శ్రీసాయిమాత నిత్య అన్నప్రసాదాలయం ద్వారకామయిలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు మందిర కమిటీ చైర్మన్ మధుసూదన్‌సాయి శనివారం తెలిపారు. శ్రీసాయిదర్బార్ యువ సేవాదళ్ సభ్యుడు కనుమూరు సాయినాథ్‌రెడ్డి జ్ఞాపకార్థం రక్తదాన శిబిరాన్ని ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. రక్తదాన శిబిరంలో పాల్గొనే వారు 95028 49784, 98663 38933 నంబర్‌ను సంప్రదించాలన్నారు. రక్తదానంతో ప్రాణదాతలు కావాలని కోరారు.